ఊరూరా హోలీ సంబురాలు

చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లోని గ్రామాల్లో మంగళవారం హోలీ సంబురాలు అంబరాన్నంటాయి. పండుగ సందర్భంగా చిన్నాపెద్దా తేడా లేకుండా ఒకరికొకరు రంగులు చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వేడుకల్లో మునిగిపోయారు. ప్రధాన కూడళ్లలో కామ దహన కార్యక్రమాలు నిర్వహించారు. పుర వీధుల్లో చిన్నారులు, యువత నృత్యాలు చేశారు. అక్కడక్కడ స్వీట్లు పంపిణీ చేసుకుంటూ వేడుకలు జరుపుకున్నారు. ప్రజాప్రతినిధులు, నాయకుల ఇళ్ల వద్ద సందడి నెలకొంది. ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు సీఐ రవీందర్, ఎస్‌ఐ ఉపేంద్రచారి రంగులు పూశారు. జమ్మికుంట పట్టణంలో ఆర్యవైశ్య మహాసభ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు యాద సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, టౌన్ సీఐ రాంచందర్‌రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ దేశిని స్వప్నకోటి, ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు. ఇల్లందకుంట మండలంలోని బూజునూరు గ్రామంలో ఎంపీపీ సరిగొమ్ముల పావని మహిళలతో హోలీ జరుపుకున్నారు.


చొప్పదండి: హోలీ సంబరాల్లో ఎమ్మెల్యే రవిశంకర్, పోలీసు అధికారులు, తదితరులు


ఇల్లందకుంట: బూజునూరులో మహిళలతో కలిసి హోలీ ఆడుతున్న ఎంపీపీ పావని


హుజూరాబాద్‌రూరల్: చెల్పూర్ గ్రామంలో హోలీ వేడుకల్లో సర్పంచ్, యువకులు


చిగురుమామిడి: ఇందుర్తి గ్రామంలో హోలీ సంబరాల్లో యువకులు, చిన్నారులు


మానకొండూర్: రంగులు చల్లుకుంటున్న మహిళలు


జమ్మికుంట: హోలీ వేడుకల్లో జమ్మికుంట టౌన్ సీఐ రాంచదర్‌రావు ఆర్యవైశ్య నాయకులు


శంకరపట్నం: రంగులు చల్లుకున్న మహిళలు, బాలికలు


రామడుగులో హోలీ వేడుకల్లో బాలికలు


రామడుగు: వెదిరలో హోలీ వేడుకల్లో చిన్నారులు


శంకరపట్నం: హోలీ వేడుకల్లో వాకర్స్ సభ్యులు


మానకొండూర్‌రూరల్: వెల్ది గ్రామంలో హోలీ సంబురాల్లో పిల్లలు


మానకొండూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో గుంపుగా చేరి నృత్యాలు చేస్తున్నచిన్నారులు



మానకొండూర్ మండల కేంద్రంలో యువకుల హోలీ సంబురాలు

ఆస్పత్రి ఉన్నా లేనట్టే

- ఎరడపల్లిలో పేరుకే పల్లె దవాఖాన
- డాక్టర్ లేక.. వైద్యం అందక తిప్పలు
- ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న ఆయా గ్రామాల ప్రజలు

శంకరపట్నం: మండలంలోని ఏరడపల్లిలో రాష్ట్ర ప్రభుత్వం 2022 మేలో పల్లె దవాఖానను ఏర్పాటు చేసింది. కాంట్రాక్ట్ పద్ధతిలో ఎంబీబీఎస్ డాక్టర్‌ను నియమించింది. కానీ ఇప్పుడు పేరుకే పల్లె దవాఖానలా తయారైంది. మే 18న డాక్టర్ వేణు విధుల్లో చేరారు. అప్పటి నుంచి ఏరడపల్లి, అర్కండ్ల గ్రామాలతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వైద్యసేవలు పొందారు. కేశవపట్నం పీహెచ్‌సీ వైద్యుడు సయ్యద్ షాకీర్‌అహ్మద్ సెప్టెంబర్‌లో సిద్దిపేట జిల్లాకు బదిలీ అయ్యారు. దీంతో ఇక్కడి పోస్టు ఖాళీగా కావడంతో వేణును కేశవపట్నం పీహెచ్‌సీకి డిప్యూటేషన్‌పై పంపించారు. ఏరడపల్లికు పల్లె దవాఖాన మంజూరై వైద్య సేవలు పొందుతామన్న ప్రజల ఆశ నిరాశే అయింది. కాంట్రాక్ట్ పద్ధతిలో నియామకమైన వేణును నవంబర్‌లో పర్మినెంట్ చేసిన ప్రభుత్వం ఎల్‌ఎండీకి బదిలీ చేశారు. దీంతో కేశవపట్నం పీహెచ్‌సీ, ఏరడపల్లికి వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అధికారులు డిప్యూటేషన్‌పై కేశవపట్నం పీహెచ్‌సీకి పంపించగా అప్పటి నుంచి కేశవపట్నంలో విధులు నిర్వర్తిస్తున్నాడు.



తెరుచుకోని ఎరడపల్లి పల్లె దవాఖాన

ఆర్‌ఎంపీలే దిక్కు

జలుబు, ఇతర సీజనల్ వ్యాధులకు గురైతే ప్రజలు ఆర్‌ఎంపీలను సంప్రదిస్తున్నారు. జ్వరం బారినపడిడినా, కుక్క, కోతి కరిచినా ఎప్పటిలాగే కేశవపట్నం, కరీంనగర్‌కు వెళ్తున్నారు. సొంత ఊళ్లో ఆస్పత్రి ఉన్నా వైద్యం అందడం లేదన్న ఆరోపణలు వెలువడుతున్నాయి. చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు వైద్యం అందుతుందన్న సంతోషం నాలుగు మాసాలకే ఆవిరైంది.

డాక్టర్‌ను నియమించాలి



ఏరడపల్లి పల్లెదవాఖానలో డాక్టర్‌ను నియమించి వైద్య సేవలు అందించాలి. డాక్టర్ లేకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రులకు పోయి డబ్బులు ఖర్చు చేసుకుంటున్నరు. ప్రభుత్వం పేదల కోసం ఏర్పాటు చేసిన పల్లె ఆసుపత్రిలో వైద్యుడు లేక పోవడంతో సేవలు అందడం లేదు.

– తాడిచెర్ల రాజయ్య, అర్కండ్ల

డిప్యూటేషన్‌పై వచ్చాను



ఏరడపల్లి పల్లె దవాఖానకు కాంట్రాక్ట్ పద్ధతిలో డాక్టర్‌గా నియామకమయ్యాను. పర్మినెంట్ కావడంతో ఎల్‌ఎండీకి బదిలీ చేశారు. కేశవపట్నం పీహెచ్‌సీలో డాక్టర్ పోస్టు ఖాళీగా ఉండడంతో డిప్యూటేషన్‌పై పంపించారు. అప్పటి నుంచి కేశవపట్నం పీహెచ్‌సీలో విధులు నిర్వర్తిస్తున్నాను.

– వేణు, డాక్టర్

ఆధ్యాత్మికం

అయప్పస్వామి ఆలయ వార్షికోత్సవం


జమ్మికుంట: గురుస్వాములు, భక్తుల పూజలు

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వేదపండితులు గొడపర్తి శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం గణపతిపూజ, అఖండ దీపారాధన, పంచగవ్యప్రాశన, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. గురుస్వాములు సిరిమల్ల జయేందర్‌స్వామి, రాజేంద్రప్రసాద్, ప్రతాప్‌రెడ్డి, మురళి, శ్రీను, దామోదర్ అయ్యప్ప సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

పూర్ణాహుతి హోమం

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్ గ్రామంలో ఉన్న పురాతన లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో మంగళవారం వేదపండితులు దామెర వెంకటేశ్వరచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆలయ ఆవరణలో పూర్ణాహుతి హోమం నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం సాయంత్రం నాగవెల్లి కార్యక్రమాన్ని నిర్వహించారు. పూజల్లో అర్చకులు నరసింహచార్యులు, రామాచార్యులు, లక్ష్మణాచార్యులు, హయగ్రీవాచార్యులు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం


రామడుగు: వెలిచాలలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం

రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామం శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో మంగళవారం రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను రథంపై ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయాభివృద్ధి కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రావు, సర్పంచ్ సరోజన, భక్తులు, పాల్గొన్నారు.

నేడు అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

చిగురుమామిడి: మండలంలోని కొండాపూర్ గ్రామంలో శ్రీఅభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. మంగళవారం అర్చకులు రామక శ్రీనివాసశర్మ, మణికంఠశర్మ సామూహిక హోమం, వివిధ పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. బుధవారం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. దాదాపు రూ.పది లక్షల వ్యయంతో పదిహేను గుంటల స్థలంలో ఆలయాన్ని నిర్మిస్తున్నామని గ్రామస్తులు వివరించారు. హోమంలో నంగునూర్ డిప్యూటీ తహసీల్దార్ నర్రా రుక్మిణిరెడ్డి, ఆంజనేయస్వామి విగ్రహ దాత, ప్రముఖ దర్శకుడు, సినీహీరో వినయ్‌బాబు, ఉపసర్పంచ్ మట్ట శ్రీనివాస్‌రెడ్డిరాధ, మాజీ సర్పంచ్ వంగర మల్లేశంసరోజన, మాజీ ఉపసర్పంచ్ పైడిపెల్లి శ్రీనివాస్‌గౌడ్‌రజిత, తోడేటి శ్రీనివాస్, సతీష్, గంగారం, లక్ష్మినారాయణ, రాజేశ్వర్‌రెడ్డి, బత్తుల వెంకటేశం, సంపత్, భూమయ్య, లింగయ్య పాల్గొన్నారు.

చొప్పదండిలో..

చొప్పదండి: పట్టణంలో నిర్మించిన సాయిబాబా ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా మంగళవారం గణపతి పూజ పూజ, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో రుత్వికులు, అర్చకులు వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం, రాత్రి భజన మండలి సభ్యులు ప్రత్యేక భజనలు చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ నిర్వాహక ట్రస్టు సభ్యులు, మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు.


చిగురుమామిడి: హోమంలో పూజారులు, గ్రామస్తులు


చొప్పదండి: పూజలు చేస్తున్న రుత్వికులు, భక్తులు

కిట్స్ అధ్యాపకులకు ప్రశంసా పత్రాలు



ప్రశంసా పత్రాలు అందుకుంటున్న కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు

హుజూరాబాద్‌రూరల్: హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలోని కేబీఆర్ స్టేడియంలో మంగళవారం ఫాస్టెస్ట్ ఫస్ట్ ద్రోణాస్ సన్మానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. హైసి(హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్ ప్రైజెస్), టాస్క్, ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డు సంస్థల ఆధ్వర్యంలో పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్యాలపై శిక్షణ తరగతులను ఏర్పాటు చేశారు. హుజూరాబాద్ మండలం సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు ఎన్. రఘు, జి.దీపక్,డా.ఎస్. రాజేంద్రప్రసాద్, డా.యోగేశ్ పుండలిక్, కె.అమర్నాథ్, డా. ఎం.శ్యామ్‌సుందర్, డా.ఎం.ప్రదీప్‌కుమార్, వి.సృజన, ఇ.స్వప్న, వి.విక్రమ్ తరగతుల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చినందుకు పద్మశ్రీ బీవీఆర్ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నారు. అనంతరం అధ్యాపకులను కిట్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ కందుకూరి శంకర్, కళాశాల ఉపాధి శిక్షణ అధికారిణి విజయలక్ష్మి, సైన్స్ విభాగాధిపతి కెప్టెన్ రవీంద్రబాబు అభినందించారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


సాధించిన మెడల్స్‌తో విద్యార్థులు

హుజూరాబాద్: రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో హుజూరాబాద్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచారని కరాటే రాష్ట్ర ఉపాధ్యక్షులు భూసారపు బాపురావు, జిల్లా అధ్యక్షుడు రొంటాల రాజ్‌కుమార్ తెలిపారు. హన్మకొండ జిల్లా పరకాలలో నిర్వహించిన పోటీల్లో వివిధ విభాగాల్లో 13 గోల్డ్ మెడల్స్ సాధించారని, ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి చేతుల మీదుగా విద్యార్థులు పతకాలు అందుకున్నారని వివరించారు. అనంతరం విద్యార్థులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్యే సతీష్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, బీఆర్‌ఎస్ నాయకులు వొడితెల ప్రణవ్‌బాబు, కొలిపాక శ్రీనివాస్ అభినందించారు.



మైక్‌సెట్ బహూకరణ

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయానికి గ్రామానికి చెందిన దాత కొలిపాక సునీతగంగయ్య దంపతులు రూ.70 వేల విలువ చేసే మైక్‌సెట్ బహూకరించారు. దేవాలయాభివృద్ధి కమిటీ చైర్మన్ రమేశ్, కమిటీ సభ్యులు సీతారాంరెడ్డి, రాజిరెడ్డి, పాపిరెడ్డి, బుచ్చిరాములుగౌడ్, సత్యనారాయణరెడ్డి, సత్యనారాయణ, మల్లేశంగౌడ్, శంకరయ్య, పూజారి డింగిరి సత్యనారాయణాచార్యులు పాల్గొన్నారు.